సాక్షి
బాపట్ల
సోమవారం | 13 | మార్చి | 2023



ఇంద్రకీలాద్రిపై ప్రత్యేక పూజలు

ఇంద్రకీలాద్రి:రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎం.సీతారామమూర్తి దంపతులు ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.



పులిచింతలలో నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 42.6707 టీఎంసీలు. ఎగువ నుంచి 200 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 2200 క్యూసెక్కులు వదులుతున్నారు.



కార్తికేయుని సన్నిధిలో భక్తుల రద్దీ

మోపిదేవి:వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ఆదివారం భక్తులతో రద్దీగా మారింది. స్వామి దర్శనానికి ఉదయం నుంచే క్యూలైన్లు నిండిపోయాయి.

న్యూస్‌రీల్

సాగరమాత సన్నిధిలో భక్తుల సందడి



విజయపురిసౌత్: సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సాగర్ మాత పుణ్యక్షేత్రానికి తరలివచ్చారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే సాగరమాత ఆలయంలో భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. ఉదయం భక్తులు కృష్ణానదిలో స్నానమాచరించి ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యబలిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం దేవాలయ ఆవరణలో తేరు ప్రదక్షిణ నిర్వహించారు. ఆ తరువాత జపమాల క్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

2,986 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

విజిలెన్స్ డీఎస్పీ శ్రీనివాసరావు



సత్తెనపల్లి: పేద ప్రజలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యం కొమెరపూడి గ్రామంలోని శ్రీవిఘ్నేశ్వర ట్రేడర్ రైస్ మిల్‌కు అక్రమంగా తరలిస్తున్నారని అందిన విశ్వసనీయ సమాచారం మేరకు గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం అర్ధరాత్రి, ఆదివారం దాడులు నిర్వహించారు. సత్తెనపల్లి మండలం కొమెరపూడి శ్రీవిఘ్నేశ్వర రైస్ మిల్‌కు కొద్ది దూరంలో అధికారులు నిఘా వేయగా 3 లోడు వాహనాలు రైస్ మిల్లులోకి వెళ్లగా ఆ వాహనాలను వెంబడించి బస్తాలు దింపుతుండగా, పట్టుకొని తనిఖీ చేశారు. మొదటి వాహనంలో 80 బస్తాల పీడీఎస్ ముద్రలు కలిగిన బియ్యం బస్తాలు, రెండో వాహనంలో 20 బస్తాల పీడీఎస్ బియ్యం, మూడో వాహనంలో 60 ప్లాస్టిక్ సంచుల్లో బియ్యం ఉన్నట్లు గుర్తించారు. మిల్లులో తనిఖీలు చేయగా 2,786 బస్తాల బియ్యం ఉన్నట్లు కనుగొన్నారు. మిల్లులోని 2,786 బస్తాల్లోని బియ్యం, 3 వాహనాల్లో 200 బస్తాలు కలిపి 2,986 బస్తాల్లో 1,493 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, 3 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మిల్లును ఆనుకొని ఉన్న గదిలో పౌరసరఫరాల ముద్రలు కలిగిన 4,000 పైగా ఖాళీ గోతాలు గుర్తించి వాటిని కూడా స్వాధీన పరుచుకున్నారు. నిత్యావసర సరుకుల చట్టం కింద 6–ఎ కేసుతో పాటు మిల్లు యజమాని కల్లం గంగాధరరెడ్డి, మూడు వాహనాల యజమానులు, డ్రైవర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సిందిగా స్థానిక సివిల్ సప్లయిస్ డెప్యూటీ తహసీల్దారు అరుణను విజిలెన్స్ అధికారులు ఆదేశించారు. తనిఖీల్లో విజిలెన్స్ డీఎస్పీ శ్రీనివాసరావు, తహసీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు, సీఐ ఎ.శ్రీహరిరావు, ఎస్‌ఐ ఎం.రామచంద్రయ్య, స్పెషల్ స్క్వాడ్ ఎస్‌ఐ వెంకటకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం వివరాలు

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 539.20 అడుగుల వద్ద ఉంది. ఇది 186.6644 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 9,443, ఎడమ కాలువకు 8,896, ఎస్‌ఎల్‌బీసీకి 1,650, వరద కాలువకు 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 20,309 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 20,309 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 819.00 అడుగుల వద్ద ఉంది. ఇది 40.0860 టీఎంసీలకు సమానం.

షోకాజ్ నోటీసు జారీ

నరసరావుపేట: గత డిసెంబరులో వెల్దుర్తి మండలం గంగలకుంట, రచ్చమల్లపాడు గ్రామాల్లో అనర్హులకు పంటసాగు పత్రాలు అందజేసి వైఎస్సార్ రైతు భరోసా పథకం వర్తించేలా అవకతవకలకు పాల్పడిన ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ షోకాజ్ నోటీసు, ఇంక్రిమెంట్లు ఆపేయాలని ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ వసంతబాబు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ.మురళి సమగ్ర తనిఖీ చేసి నివేదిక అందజేశారు. పంట సాగు పత్రాలు మంజూరు విషయంలో అశ్రద్ధగా వ్యవహరించిన వెల్దుర్తి మండల తహసీల్దార్ శ్రీనివాస యాదవ్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. వెల్దుర్తి మండలానికి చెందిన గంగలకుంట, రచ్చమల్లపాడుకు చెందిన వీఆర్‌ఓలు బాతుల ఉమాదేవి, పి.జానయ్య, ఉద్యానవన సహాయకులు నూదుల వెంకటేశ్వర్లు, కొండలవాతు శివానాయక్‌కు ఒక వార్షిక ఇంక్రిమెంట్ నిలుపుదల చేయాల్సిందిగా అధికారులకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.



చిలకలూరిపేటలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



గుంటూరులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు ముస్తఫా, మద్దాళి గిరి



రేపల్లెలో కేక్ కట్ చేస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు

అంబరాన్నంటిన వైఎస్సార్ సీపీ ఆవిర్భావ సంబరం

నైతిక విలువలు పునాదిగా.. ఆదర్శాలు ఆయుధంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో పురుడుపోసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సంబరాలు ఆదివారం అంబరాన్నంటాయి. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో వాడవాడలా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆనందోత్సాహాల మధ్య వేడుకలు జరుపుకున్నారు. వైఎస్సార్ సీపీ జెండాల ఆవిష్కరణలతో పాటు కేక్‌లు కట్ చేసి సంతోషాలు పంచుకున్నారు. వైఎస్సార్ సీపీ పురోభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతామని ప్రతినబూనారు. – సాక్షి నెట్‌వర్క్

నేడు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- పోలింగ్ సిబ్బందికి బ్యాలెట్ పత్రాలు, బాక్స్‌లు
- ఆదివారం పంపిణీ చేసిన కలెక్టర్
- పోలింగ్‌పై అధికారులకు దిశానిర్దేశం
- చీరాల, పర్చూరు, అద్దంకిలో 40 పోలింగ్ కేంద్రాలు
- ఓటు హక్కు వినియోగించుకోనున్న 28,179 మంది ఓటర్లు



ఎన్నికల నియమావళిపై సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్

సాక్షి ప్రతినిధి, బాపట్ల: తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు సోమవారం పోలింగ్ జరగనుంది. బాపట్ల జిల్లా పరిధిలోని చీరాల, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లోని 27 పోలింగ్ బూత్‌ల పరిధిలో పట్టభద్రుల స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. 26,390 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పైమూడు నియోజకవర్గాల పరిధిలో 13 పోలింగ్ కేంద్రాల ద్వారా పోలింగ్ జరగనుంది. 1789 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అప్పటి వరకు క్యూలో ఉన్న వారికి ఓటు హక్కు కల్పించనున్నారు. జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్ నేతృత్వంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ఎస్పీ వకుల్‌జిందాల్ నేతృత్వంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

పోలింగ్ కేంద్రాలకు సామగ్రి..

చీరాలలోని మున్సిపల్ హైస్కూల్‌లో ఆదివారం అధికారులు పోలింగ్ సిబ్బందికి, బ్యాలెట్ పత్రాలు, బాక్స్‌లు, ఇతర సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ వకుల్‌జిందాల్, జేసీ శ్రీనివాసులు పోలింగ్ తీరుపై పోలింగ్ అధికారులు, సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా చూడాలన్నారు. పోలింగ్ కోసం 40 పోలింగ్ బూత్‌ల పరిధిలో పోలింగ్ సిబ్బందితో పాటు పెద్ద ఎత్తున పోలీస్ బలగాలను ఏర్పాటు చేశారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు చేపట్టారు.



బ్యాలెట్ బాక్స్‌లతో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న సిబ్బంది

ప్రధాన పార్టీల మద్దతుతో బరిలో అభ్యర్థులు

ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచిన కొందరు అభ్యర్థులకు ప్రధాన పార్టీలు మద్దతు పలకగా, మరి కొందరు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీలో ఉన్నారు. పట్టభద్రుల స్థానానికి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి అధికార పార్టీ మద్దతుతో పోటీలో ఉన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం నుంచి పోటీలో ఉన్న పి.చంద్రశేఖర్‌రెడ్డికి అధికార పార్టీ మద్దతు తెలుపుతోంది. పట్టభద్రులు, ఉపాధ్యాయ స్థానాలకు మొత్తం 30 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

చీరాల టౌన్: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విధులను పోలింగ్ అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. ఆదివారం పట్టణంలోని ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ ఆవరణలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ అధికారులకు ఎన్నికల సామగ్రి పంపిణీ చేశారు. జిల్లా పరిధిలోని చీరాల, పర్చూరు, అద్దంకి డివిజన్‌లోని 13 మండలాల్లో ఎన్నికలు జరుగుతున్నాయని చెప్పారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల విధులు కేటాయించిన పోలింగ్ ఆఫీసర్లు, ఏపీవోలు ఎన్నికల సంఘం ఆదేశాలను విధిగా పాటించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశామని, అవాంతరాలపై రాతపూర్వకంగా తెలపాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ అధికారులు అప్రమత్తంగా విధులను నిర్వహించాలన్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత పోలింగ్ సామాగ్రిని రూట్ ఆఫీసర్లు పోలీసు బందోబస్తుతో రిసెప్షన్ కేంద్రానికి తీసుకువచ్చి ఎన్నికల సామాగ్రిని అప్పగించాలని చెప్పారు. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేలా అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశామని, ఎన్నికల సిబ్బంది విధులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అనంతరం పీవోలకు వేర్వేరుగా బ్యాలెట్ పేపర్లు, ఇతర ఎన్నికల సామాగ్రిని కలెక్టర్ అందించారు. సిబ్బందిని తరలించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సులు, పోలీసు బందోబస్తుతో ఆయా కేంద్రాలకు సిబ్బందిని తరలించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, చీరాల ఆర్డీవో సరోజిని, బాపట్ల ఆర్డీవో రవీంద్ర, ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



చీరాల: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఆదివారం చీరాల పట్టణంలోని మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో ఎమ్మెల్సీ ఎన్నికలపై ఎస్పీ పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఎస్పీ జిందాల్ మాట్లాడుతూ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జిల్లాలోని 13 మండలాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో జరుగుతాయన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. పోలింగ్ పూర్తయిన తర్వాత బ్యాలెట్ బాక్సులు కౌంటింగ్ కేంద్రానికి చేరేవరకు పోలీసులు అప్రమత్తంగా ఉండి ఎన్నికలను సమర్థవంతంగా, ప్రశాంతంగా జరిపించేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. మొత్తం 697 మందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, చీరాల, బాపట్ల రేపల్లె డీఎస్పీలు శ్రీకాంత్, శ్రీనివాసరావు, టి.మురళీకృష్ణ, జిల్లా పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలు, ఏఆర్ పోలీసులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం



డాక్టర్ వైఎస్సార్ యూపీహెచ్‌సీ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

- బలోపేతం దిశగా ప్రభుత్వాసుపత్రులు
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- చిలకలూరిపేటలో డాక్టర్ వైఎస్సార్ యూపీహెచ్‌సీ ప్రారంభం

చిలకలూరిపేట: ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో రూ.95 లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. మంత్రి రజిని మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి 20 వేల నుంచి 30 వేల జనాభాకు వైద్య సేవలు అందించేలా అర్బన్ హెల్త్ సెంటర్లను అందుబాటులోకి తీసుకొచ్చిన గొప్ప ప్రభుత్వం తమదని చెప్పారు. ఈ ఆసుపత్రుల్లో సరిపడా వైద్య సిబ్బందిని కూడా నియమించినట్లు తెలిపారు. వైద్యులు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఇతర వైద్య సిబ్బంది పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటారని చెప్పారు. ఒక్క చిలకలూరిపేట పట్టణంలోనే ఏకంగా ఆరు అర్బన్ హెల్త్ సెంటర్లు ఆధునిక వసతులతో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. నాడు–నేడు కింద రాష్ట్ర వ్యాప్తంగా సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, బోధన ఆసుపత్రులను తీర్చిదిద్దామని చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా వీటి సంఖ్యను పెంచుతున్నట్లు వెల్లడించారు.

ప్రజలకు వరం ఫ్యామిలీ డాక్టర్..

మంత్రి విడదల రజిని మాట్లాడుతూ వైద్య ఆరోగ్య రంగంలో జగనన్న తీసుకొచ్చిన గొప్ప సంస్కరణల్లో ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానం ఒకటని తెలిపారు. ప్రస్తుతం ట్రయల్ రన్‌లో ఈ కార్యక్రమం ఉందని, ఇప్పటికే అద్భుతమైన ఫలితాలను ఈ విధానం ఇస్తోందని చెప్పారు. ఈ నూతన విధానం ద్వారా వైద్యులు నేరుగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి సచివాలయానికి వస్తారని తెలిపారు. అక్కడే ప్రజలకు కావాల్సిన వైద్య సేవలు అందజేస్తారని చెప్పారు. మందులు కూడా ఉచితంగా అందజేస్తారని పేర్కొన్నారు. ఆసుపత్రికి రాలేక దీర్ఘకాలిక వ్యాధులతో ఇళ్లకే పరిమితం అయిన రోగులకు కూడా వైద్యులు ఇళ్లకు వెళ్లి వైద్య సేవలు అందిస్తారని వివరించారు. ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానం ద్వారా వైద్యులు అంగన్‌వాడీ సెంటర్లు, పాఠశాలలను కూడా సందర్శిస్తారని చెప్పారు. అక్కడి విద్యార్థులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారని తెలిపారు. వైద్య ఆరోగ్య రంగ చరిత్రలో ఇది గొప్ప విప్లవాత్మక మార్పని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైస్ చైర్మన్లు వలేటి వెంకటేశ్వరరావు, కొలిశెట్టి శ్రీనివాసరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, డీఎంఅండ్‌హెచ్‌వో శోభారాణి, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తజనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వార్షిక పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని, పోటీ పరీక్షల్లో మంచి ర్యాంకులు రావాలని విద్యార్థులు, అమ్మవారి ఆశీస్సుల కోసం నవ దంపతులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం రికార్డు స్థాయిలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో సర్వ దర్శనానికి రెండు గంటలకు పైగానే సమయం పట్టింది. ఉదయం ఆరు గంటల నుంచే భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం కనిపించింది. ఘాట్‌రోడ్డు, మహా మండపం లిఫ్టు, మెట్ల మార్గం ద్వారా కొండ పైకి చేరుకున్న భక్తులు సర్వదర్శనం, రూ.100, రూ.300, రూ.500 టికెట్లు కొనుగోలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దేవస్థాన ఈవో భ్రమరాంబ, చైర్మన్ కర్నాటి రాంబాబు పలుమార్లు ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్లను పర్యవేక్షించారు. టికెట్లు లేకుండా ఎవరినీ వీఐపీ దర్శనానికి అనుమతించవద్దని సిబ్బందిని హెచ్చరించారు. అమ్మవారికి మహా నివేదన నిమిత్తం అరగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేయడంతో రద్దీ మరింత పెరిగింది. మధ్యాహ్నం 2.30 గంటల వరకు రద్దీ కొనసాగింది. ఇక అమ్మవారికి నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. రాజగోపురం కళావేదికపై లోక కల్యాణార్థం, సర్వ మానవాళి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ సూర్యోపాసన సేవ నిర్వహించారు.



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో కిటకిటలాడుతున్న భక్తులు

హాల్ టికెట్లతో ఆలయానికి..

బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానుండటంతో అమ్మవారి పాదాల వద్ద హాల్ టికెట్లు ఉంచి ఆశీస్సులు అందుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు.

పెళ్లికి వెళ్లివస్తూ మృత్యుఒడికి

- రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమారుడు మృతి
- మరొకరి పరిస్థితి విషమం
- కనిగిరి సమీపంలో చప్టా గుంతలో పడిన కారు
- మృతులది పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా రాంపల్లి గ్రామం



మృతుడు నర్రా రామకోటేశ్వరరావు



మృతుడు నర్రా బ్రహ్మేశ్వరరావు

కనిగిరి రూరల్: రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమారుడు మృతి చెందగా తల్లికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన కనిగిరి సమీపంలోని కాశిరెడ్డి కాలనీ వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగింది. ఈ ప్రమాదంలో పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం రాంపల్లి గ్రామానికి చెందిన నర్రా రామకోటేశ్వరరావు, అతని కుమారుడు నర్రా బ్రహ్మేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందారు. రామకోటేశ్వరరావు భార్య సత్యవాణి తలకు బలమైన గాయాలు కావడంతో ప్రథమ చికిత్స అనంతరం ఒంగోలు తరలించారు.

వివాహానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో..

పోలీసుల కథనం ప్రకారం.. కృష్ణా జిల్లా పెసలపాడు గ్రామానికి చెందిన నర్రా రామకోటేశ్వరరావు కుటుంబం 23 ఏళ్ల కిత్రం పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం రాంపల్లి గ్రామానికి వలస వచ్చి వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో బాపట్ల జిల్లా రేపల్లె దగ్గర రాయవారిపల్లిలో వివాహానికి నర్రా బ్రహ్మేశ్వరరావు, తండ్రి రామకోటేశ్వరరావు, తల్లి నర్రా సత్యవాణి కలిసి కారులో వెళ్లారు. పెళ్లి అనంతరం శనివారం రాత్రి కారులో తిరుగు ప్రయాణమయ్యారు. వీరు ప్రయాణిస్తున్న కారు 2:30 గంటల సమయంలో కనిగిరి సమీపంలోని కాశిరెడ్డి కాలనీ వద్దకు రాగానే చప్టా గుంతలో పల్టీలు కొట్టింది. ప్రమాదంలో కారు నడుపుతున్న నర్రా బ్రహ్మేశ్వరరావు (48), నర్రా రామకోటేశ్వరరావు (67) అక్కడికక్కడే మృతి చెందారు. వెనుక సీటులో ఉన్న సత్యవాణికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను 108 వాహనంలో కనిగిరి ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం ఒంగోలు రిమ్స్‌కు పంపించారు. కారులో ఇరుక్కున్న నర్రా బ్రహ్మేశ్వరరావు మృతదేహాన్ని పోలీసులు బయటకు తీశారు. తండ్రి, కుమారుల మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతుడు రామకోటేశ్వరరావు పుట్టు అంధుడని బంధువులు తెలిపారు. నర్రా బ్రహ్మేశ్వరరావుకు ఇద్దరు కుమారులు ఉన్నారు. సంఘటన స్థలాన్ని సీఐ బి.పాపారావు, ఎస్‌ఐ దాసరి ప్రసాద్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆగిఉంటే ప్రాణాలు దక్కేవి..

మార్గంలో పొదిలిలో ఆగి ఉదయాన్నే వెళ్లాలని బంధువులు చెప్పినా వినకుండా ప్రయాణం సాగించినట్లు తెలిపారు. ఆగిఉన్నా ప్రాణాలు మిగిలేవని బంధువులు బోరున విలపిస్తున్నారు. సుమారు ఒంటి గంట సమయంలో మృతుడు బ్రహ్మేశ్వరరావు భార్య జ్యోతికి ఫోన్ చేసి దర్శి సమీపంలో ఉన్నానని చెప్పాడని, ఆ తర్వాత ఫోన్ పనిచేయలేదని కన్నీరుమున్నీరుగా విలపించారు.

సీఎం జగన్ పాలన స్వర్ణయుగం

మంత్రి మేరుగ నాగార్జున



అక్కివారిపాలెంలో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి నాగార్జున

అక్కివారిపాలెం(భట్టిప్రోలు): రాష్ట్రంలో సీఎం జగన్ పాలన స్వర్ణయుగమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలం పెద పులివర్రు పంచాయతీ పరిధిలోని అక్కివారిపాలెంలో ఆదివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న విశ్వాసం మరింత పెరిగిందని చెప్పారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భవించినప్పటి నుంచి కేంద్రంలో కాంగ్రెస్, రాష్ట్రంలో టీడీపీ, జనసేనలు ఇబ్బందులు పెట్టినప్పటికీ సీఎం జగన్ మడమ తిప్పక ప్రజల్లో ఒక్కడిగా, ప్రజల మనిషిగా, పాదయాత్రలో వారి కష్టాల్ని తెలుసుకున్నారని చెప్పారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజల కష్టాలు తీర్చే దిశగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల్ని లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేసి అక్రమాలకు తావులేకుండా జగన్ పరిపాలన కొనసాగిస్తున్నారని వివరించారు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం ఆయన కార్మికుడిలా పని చేస్తున్నారని తెలిపారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మరో మారు విజయబావుటా ఎగుర వేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయనటువంటి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను సీఎం జగన్ ప్రవేశపెట్టి ఆదర్శప్రాయుడిగా నిలిచారని కొనియాడారు. సమావేశంలో సర్పంచ్ నీలా ఉషారాణి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి పాల్గొన్నారు.

దొంగ ఓట్లతో గెలిచే నీచమైన సంస్కృతి చంద్రబాబుది

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి



క్రీడా సామగ్రి అందజేస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

చెరుకుపల్లి: దొంగ ఓట్లతో గెలిచి అధికారాన్ని హస్తగతం చేసుకునే నీచమైన సంస్కృతి చంద్రబాబుదని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి తీవ్ర స్థాయిలో విమర్శించారు. చెరుకుపల్లిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఓటమి భయంతో దొంగ ఓట్లు అంటూ విమర్శలు చేస్తూ చంద్రబాబు నాటకాలకు తెరతీయడం కొత్త కాదని ఎద్దేవా చేశారు. కుప్పంలో వివిధ ఫిర్యాదుల ద్వారా ఎన్నికల కమిషన్ 26వేల దొంగ ఓట్లు ఉన్నట్లు గుర్తించి వాటిని తొలగించడంతో చంద్రబాబుకు ఇప్పుడే ఓటమి భయం పట్టుకుందని తెలిపారు. ఆయన ఎన్ని కుయుక్తులు పన్నినా వైఎస్సార్ సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులే గెలుపొందడం ఖాయమని స్పష్టం చేశారు.

బీసీల గురించి పవన్ కల్యాణ్ మాట్లాడటం హాస్యాస్పదం

బీసీలను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకున్న చంద్రబాబు పాలనలో వారిని అణగదొక్కుతుంటే మాట్లాడని పవన్ కల్యాణ్ నేడు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని మోపిదేవి విమర్శించారు. టీడీపీ పాలనలో బీసీలకు శాసన మండలిలో, రాజసభలో ఎంతమందికి స్థానం కల్పించారో ఆయన తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందని సూచించారు. పదవులు అమ్ముకునే టీడీపీతో జతకట్టిన పరిస్థితి మరిచిపోయావా ? అంటూ పవన్‌కల్యాణ్‌ను ఎద్దేవా చేశారు. వార్డు సభ్యులుగా కూడా పోటీ చేయలేని బీసీ వర్గంలోని కొన్ని కులాల వారికి రాష్ట్ర పాలనలో సముచిత స్థానం కల్పిస్తూ కార్పొరేషన్ చైర్మన్ పదవుల్ని అందించిన ఘనత వై.ఎస్.జగన్‌కే దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్, మండల కన్వీనర్ పైనం ఏడుకొండలరెడ్డి పాల్గొన్నారు.

కెనోయింగ్ క్రీడాకారులకు సామగ్రి పంపిణీ

రేపల్లె రూరల్: కెనోయింగ్ (పడవ పందెం) క్రీడాకారులకు ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు చేయూతనందించారు. కృష్ణాజిల్లా నాగాయలంక గ్రామానికి చెందిన నాగిడి గాయత్రి, నాగిడి భార్గవి కెనోయింగ్ క్రీడలో రాణిస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో శిక్షణ పొందుతూ ఏషియన్ గేమ్స్‌కు ఎంపికయ్యారు. పేదరికం వల్ల క్రీడా సామగ్రి సమకూర్చుకోవడానికి అవస్థలు పడుతున్నట్లు ఎంపీ మోపిదేవి దృష్టికి రావడంతో ఆయన స్పందించారు. ఒక్కొక్కరికీ రూ.55వేలు విలువ చేసే సామగ్రిని పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం అందజేశారు. క్రీడల్లో రాణించి రాష్ట్రానికి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు పాల్గొన్నారు.

కంటి సమస్యల పరిష్కారమే ధ్యేయం

బజరంగ్ సీఈవో అంబటి మురళీకృష్ణ



దివ్యాంగుడికి వీల్ చైర్ అందజేస్తున్న అంబటి మురళీకృష్ణ

బాపట్ల టౌన్: కంటి సమస్యల పరిష్కారమే బజరంగ్ ఫౌండేషన్ ధ్యేయమని ఫౌండేషన్ సీఈవో అంబటి మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని ముత్తాయపాలెంలో ఈనెల 6న తీరప్రాంత గ్రామాల్లోని మత్స్యకారులకు, పేదలకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో కళ్లజోళ్ల అవసరాన్ని గుర్తించిన 504 మందికి సోమవారం ఉచితంగా పంపిణీ చేశారు. బజరంగ్ ఫౌండేషన్ సీఈవో అంబటి మురళీకృష్ణ తీర ప్రాంత గ్రామాల్లోని గంగపుత్రులు, మత్స్యకార కుటుంబాలే లక్ష్యంగా నిర్వహించిన ఈ శిబిరానికి అనూహ్య రీతిలో స్పందన లభించిందన్నారు. మొత్తం 702 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించగా, వారిలో కళ్లజోళ్లు అవసరమైన 504 మందికి ఆరు రోజుల వ్యవధిలోనే అందించామని తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన స్ఫూర్తిగా మొదలైన జగన్నామ సంక్షేమ సంవత్సరం సేవా కార్యక్రమాల పరంపర ఈ ఏడాది చివరి వరకూ కొనసాగుతూనే ఉంటుందని చెప్పారు. అనంతరం ఆదర్శనగర్ గ్రామానికి చెందిన దివ్యాంగుడు నాయుడు బాబులుకు అంబటి మురళీకృష్ణ వీల్ చైర్‌ను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు కళ్లం హరినాథరెడ్డి, బజరంగ్ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

ఏపీ హైకోర్టు న్యాయమూర్తి రావు రఘునందరావు



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి రఘునందరావు

పిడుగురాళ్ల : చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందరావు సూచించారు. పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో శ్రీ భారతి దేవాలయ పరిరక్షణ వేదిక, పల్నాడు ప్రాంత న్యాయవాదుల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తితో పాటు పలువురికి శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ హిందూ, మహ్మదీయ, క్రైస్తవ చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని సూచించారు. ముఖ్యంగా వారసత్వ ఆస్తులపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ న్యాయమూర్తుల మాజీ ప్రధాన కార్యదర్శి వి.వై.ఆర్. కృష్ణారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన పెంచుకోవడం వల్ల అనవసరపు కేసులు ఉండవని, సమస్యలు కూడా త్వరితగతిన పరిష్కారం అవుతాయని చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.వి.వి.పార్థసారథి, గుంటూరు జిల్లా నాలుగో అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి జి.రామగోపాల్, పదో అదనపు న్యాయమూర్తి జి. వెంకటేశ్వర్లు, పిడుగురాళ్ల జూనియర్ సివిల్ జడ్జి జి. మురళీగంగాధర్‌రావు, గురజాల ఆర్డీవో ఎం. అద్దెయ్య, మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, మద్దాలి సుబ్బయ్య, పట్టణ ప్రముఖులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఇంటర్ యూనివర్సిటీ చాంపియన్ ద్వారక



బంగారు పతకం అందుకున్న ద్వారక

చీరాల రూరల్: ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌గా చీరాల క్రీడాకారిణి సాతుపాటి ద్వారక ఎంపికైంది. పోటీల్లో పాల్గొన్న ఆమె అన్ని విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి బంగారు పతకం సాధించింది. 2022–23 పోటీల్ని ఈనెల 9 నుంచి 12 వరకు హిమాచల్‌ప్రదేశ్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో నిర్వహించారు. భారతి డిగ్రీ కాలేజీలో విద్యనభ్యసిస్తున్న చీరాల ఉజిలిపేటకు చెందిన ద్వారక 76 కేజీల విభాగంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తరఫున పోటీల్లో పాల్గొంది. స్నాచ్, డెడ్‌లిఫ్ట్‌లో బంగారు పతకం సాధించింది. స్నాచ్ 222.5 కేజీలు, బెంచ్ 102.5, డెడ్‌లిఫ్ట్ 202.5 బరువులు ఎత్తి చాంపియన్‌గా నిలిచింది. ఓవరాల్‌గా 527.5 కేజీలు ఎత్తడంతో నిర్వాహకులు ఆమెను చాంపియన్‌గా ప్రకటించి బంగారు పతకంతో పాటు ప్రశంస పత్రాన్ని అందించి సత్కరించారు. ఇప్పటికే ఆమె అనేక రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించింది. ఆమె క్రీడా కోచ్‌గా ఎన్. సుబ్రహ్మణ్యం వ్యవహరిస్తున్నారు. యూనివర్సిటీ చాంపియన్‌గా నిలిచిన ద్వారకను పట్టణంలోని పలువురు క్రీడాభిమానులు అభినందించారు.

కంచర గాడిదల మాంసం విక్రయిస్తున్న ఎనిమిది మంది అరెస్టు



మాంసాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

చెరుకుపల్లి: గాడిదల మాంసమని జనాన్ని మభ్యపెట్టి కంచర గాడిదల మాంసాన్ని విక్రయించేందుకు ప్రయత్నించిన ఎనిమిది మందిని ఆదివారం తెల్లవారుజామున చెరుకుపల్లిలో పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక ఎస్ఐ కొండారెడ్డి వివరాల మేరకు.. చెరుకుపల్లికి చెందిన పెండ్రా వెంకటేష్, మొగలి ఏసుబాబు, మాచర్ల తిరుమలరావు, మొగలి అనీల్ కుమార్, పాలపర్తి ఫణీంద్ర, కట్టా నాగేంద్రం, పాలపర్తి గోపి, పెండ్రా రమేష్ కొన్నేళ్లుగా బెంగుళూరు, కర్నాటక రాష్ట్రాల నుంచి కంచర గాడిదలను తీసుకువచ్చి మామూలు గాడిద మాంసంగా అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు, యథావిధిగా ఆదివారం తెల్లవారుజామున ఆరుంబాక వెళ్లే రహదారి పక్కన కంచర గాడిదెల్ని కోస్తున్నట్లు గుంటూరు బ్లూ క్రాస్ వారికి కొందరు సమాచారం ఇవ్వడంతో వారు స్థానిక పోలీసుల సాయంతో ఎనిమిది మంది వ్యక్తులతో పాటు ప్రాణాలతో ఉన్న రెండు కంచర గాడిదెలను, ప్రాణం తీసి మాంసం తీస్తున్న మరో రెండు గాడిదెలను, మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. బ్లూ క్రాస్ సంస్థ కార్యదర్శి జాగు సురేష్ ఫిర్యాదు మేరకు ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి కేసులో మహిళ అరెస్టు

బాపట్ల టౌన్: గంజాయి కేసులో మహిళను పట్టణ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ పి. కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల పట్టణానికి చెందిన దేవరకొండ నాగమణి గతంలో గంజాయి సరఫరా చేస్తూ పట్టుబడిన కేసులో ఏ–1 ముద్దాయిగా ఉంది. ఆమెకు ఒంగోలుకు చెందిన కట్టా అనూరాధ గంజాయి సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. పట్టణంలోని నరాలశెట్టివారిపాలెం సమీపంలో సోమవారం నాగమణి సంచరిస్తున్నట్లు గమనించి అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

సాంస్కృతిక విప్లవమే బౌద్ధ ధర్మం



గౌతమ బుద్ధుడు, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న బీఎస్ఐ నిర్వాహకులు

భట్టిప్రోలు: సాంస్కృతిక విప్లవమే బౌద్ధ ధర్మం అని ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా(బీఎస్ఐ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.కోటేశ్వరరావు పేర్కొన్నారు. బాపట్ల జిల్లా భట్టిప్రోలులోని బౌద్ధ స్తూపం ఆవరణలో ఆదివారం బీఎస్ఐ ప్రథమ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రేపల్లెకు చెందిన సీనియర్ న్యాయవాది, అంబేడ్కరిస్ట్ దారం సాంబశివరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా భట్టిప్రోలు సర్పంచ్ దారా రవి కిరణ్మయి పాల్గొన్నారు. గౌతమ బుద్ధుడు, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. సమావేశంలో సాంస్కృతిక విప్లవానికి నాంది పలుకుదాం అంటూ ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేశారు. కులం, మతం లేని నూతన మానవీయ సమాజాన్ని నిర్మిద్దామని పలువురు వక్తలు పేర్కొన్నారు. బౌద్ధ ధర్మం ఔన్నత్యాన్ని, విశిష్టతను వివరించారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

బాపట్ల జిల్లా నూతన అధ్యక్షుడిగా (బీఎస్ఐ) న్యాయవాది దారం సాంబశివరావు, ప్రధాన కార్యదర్శిగా బాపట్లకు చెందిన జి.రాజారావు పలువురు సభ్యులతో నూతన కార్యవర్గం ఏర్పడింది. సమావేశంలో బీఎస్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు జి. బాబూరావు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీస్ సమాఖ్య రేపల్లె తాలూకా ప్రధాన కార్యదర్శి రాచాబత్తుని శ్రీనివాసరావు, ఓలేరు సర్పంచ్ మేరుగ రంగారావు, ఎస్సీ ఎంప్లాయీస్ సంఘం రేపల్లె ప్రాంత అధ్యక్షుడు దర్శి భాస్కరరావు, న్యాయవాదులు ప్రతాప్, రమేష్ రామ్‌జీ, పీటా వెంకట్, జాకబ్, లక్ష్మణరావు, ఆదినారాయణ, మధు, జొన్నాదుల వెంకటేశ్వర్లు, బుస్సా రాజారత్నం, ధారా చెన్నయ్య, జడా రవీంద్ర, మాతంగి రత్నకుమార్ పాల్గొన్నారు.

గుట్టుచప్పుడు కాకుండా గంజాయి చాక్లెట్ల విక్రయం

పారిశ్రామిక కేంద్రం గణపవరంలో యథేచ్ఛగా అమ్మకాలు



గంజాయి కలిపిన చాక్లెట్లు

నాదెండ్ల: వలస కార్మికులు ఎక్కువగా ఉండే పారిశ్రామికవాడ గణపవరంలో గంజాయి కలిపిన చాక్లెట్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వ్యాపారులు కొత్తమార్గాన్ని ఎంచుకుని వ్యాపారాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. పొడిరూపంలో ఉండే గంజాయిని పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగం అడ్డుకుంటుండటంతో లిక్విడ్ గంజాయి దందా సాగించారు. దాన్ని కూడా పోలీసులు పసిగట్టి నియంత్రించటంతో ఇప్పుడు కొత్త పంథాని ఎంచుకున్నారు. లిక్విడ్ గంజాయిని చాక్లెట్ రూపంలో మార్చి విక్రయిస్తున్నారు. వివిధ రకాల హిందీ పేర్లతో చాక్లెట్‌ను పోలిన కవర్‌లో ప్యాక్ చేసి అమ్ముతున్నారు. దీన్ని తిన్న తర్వాత ఏదైనా స్వీట్‌ను తింటే ఆ వ్యక్తికి మద్యం తాగిన మత్తు ఎక్కుతుంది. ఒక పూట ఈ కిక్కులో పడిపోతారు. పారిశ్రామిక కేంద్రమైన గణపవరంలో వలస కార్మికులు ఎక్కువగా ఉండటంతో గుట్టుచప్పుడు కాకుండా ఈ దందా కొనసాగుతోంది. ఎక్కువగా బీహార్, ఒడిషా, ఉత్తరాంధ్ర కార్మికులు ఉండే ప్రాంతాల్లో అమ్మకాలు జరుపుతున్నారు. చాక్లెట్ కవర్లలో ఉండటంతో ఎవరికీ అనుమానం కూడా రావడం లేదు. ఆయా కవర్లపై తయారీదారుల వివరాలు ఏవీ కనిపించవు. పోలీసులు దీనిపై దృష్టి సారించి నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.

కోట్ల హృదయాల్లో సీఎం వైఎస్ జగన్ స్థానం సుస్థిరం

వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవంలో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



జెడ్పీ క్యాంపు కార్యాలయంలో జెడ్పీటీసీలతో కలిసి కేక్ కట్ చేస్తున్న చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: కోట్లాది మంది ప్రజల ఆదరాభిమానాలను సంపాదించుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పెను సవాళ్లను అధిగమించి ఆదర్శనేతగా నిలిచారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. ఆదివారం జెడ్పీ క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించిన హెనీ క్రిస్టినా మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జెడ్పీటీసీలందరితో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆమె మాట్లాడుతూ కోట్లాదిమంది ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించిన జననేత జగనన్న ప్రజల కోసం స్థాపించిన వైఎస్సార్ సీపీ 12 ఏళ్లు పూర్తి చేసుకుని, 13వ ఏట అడుగుపెట్టిందన్నారు. పాదయాత్రలో పేద ప్రజల గుండెచప్పుడు విని వాటిని నవరత్నాలుగా మలిచి, సీఎంగా అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 98 శాతం హామీలను అమలు పర్చిన ఏకైక నేతగా నిలిచారన్నారు. రాబోయే ఎన్నికల్లో 175 కి 175 సీట్లు సాధించే విధంగా ప్రజలందరూ సీఎం వైఎస్ జగన్‌కు అండగా ఉండి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బత్తుల అనురాధ, జెడ్పీటీసీలు రమేష్, కందుల సిద్ధయ్య, వెంకటలక్ష్మి, గుల్జార్‌బేగం, లక్ష్మీప్రణతి, వెంకట పావని, వైఎస్సార్ సీపీ నేత గోవిందరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా మహిళల వాలీబాల్‌లో సువర్ణాధ్యాయం

- ప్రతిభ చూపిన జట్టుకు సన్మానం
- ఈ ఘతన ఇలాగే కొనసాగాలన్న క్రీడాప్రముఖులు



జిల్లా మహిళా జట్టు క్రీడాకారిణులతో అసోసియేషన్ నేతలు

తెనాలి: పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరులో ఇటీవల నిర్వహించిన అంతర జిల్లాల సీనియర్ మహిళల వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ ప్రదర్శించి తొలిసారిగా విన్నర్స్‌గా నిలిచిన గుంటూరు జిల్లా మహిళల జట్టును జిల్లా వాలీబాల్ అసోసియన్ సత్కరించింది. స్థానిక అమరావతి ప్లాట్స్ లోని అన్నాబత్తుని సత్యనారాయణ క్రీడా స్టేడియంలో ఆదివారం ఏర్పాటైన సభకు అసోసియేషన్ అధ్యక్షుడు, భారత వాలీబాల్ జట్టు మాజీ కెప్టెన్ జె.సింగారావు అధ్యక్షత వహించారు. అసోసియేషన్ కార్యదర్శి ఎస్.నిరంజనరావు సభను నిర్వహించారు. భారత వాలీబాల్ జట్టు మాజీ సహాయ కోచ్ బీవీ ప్రసాద్ మాట్లాడుతూ మహిళల జట్టు రాష్ట్ర స్థాయి విజేతగా నిలవటం సువర్ణ అధ్యాయమని చెబుతూ, ఈ ఘనత కొనసాగాలని సూచించారు. జిల్లా అసోసియేషన్ వాలీబాల్ క్రీడాభివృద్ధికి చేస్తున్న కృషిని వివరించారు. ఏజీఎస్ఏ పూర్వ క్రీడాకారుడు, విశ్రాంత ప్రిన్సిపాల్ పరుచూరి రాఘవేంద్రరావు మాట్లాడుతూ వాలీబాల్ క్రీడలో జిల్లానుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన క్రీడాకారులున్నట్లు చెప్పారు. గతంలో బుచ్చిరామయ్య, జి.గోపీచంద్ క్రీడా ఉన్నతికి చేసిన కృషిని వివరించారు. రిటైర్డ్ డీఎస్పీ సింహాచలం మాట్లాడుతూ క్రీడాకారులు కృషి, పట్టుదలతోపాటు ఆటలో టెక్నిక్‌ను నేర్చుకోవాలని సూచించారు. సభానంతరం 1963లో సౌత్‌జోన్‌కు ఆడిన ఏపీ మహిళా వాలీబాల్ జట్టు కెప్టెన్‌గా పనిచేసిన బేబీ సరోజినిదేవి సమకూర్చిన స్పోర్ట్స్ కిట్‌ను క్రీడాకారిణులకు బహూకరించారు. కార్యక్రమంలో 'శాప్' రిటైర్డ్ డెప్యూటీ డైరెక్టర్ జి.గోపీచంద్, జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.రవిశేఖరరెడ్డి, మాజీ కార్యదర్శి గోగినేని బుల్లిప్రసాద్, రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి జీకేఎస్ విజయ్‌చంద్ పాల్గొన్నారు.

నృసింహస్వామి ఆలయ జూనియర్ అసిస్టెంట్‌పై కేసు

పోలీసులుకు ఫిర్యాదు చేసిన ఆలయ ఈఓ



విలేకరులతో మాట్లాడుతున్న ఆలయ ఈవో రామకోటిరెడ్డి

మంగళగిరి: స్థానిక శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయ ఆదాయాన్ని పక్కదారి పట్టించిన జూనియర్ అసిస్టెంట్ వట్టికూటి శ్రీనివాస్(వాసు)పై క్రిమినల్ కేసు నమోదైంది. గత జూన్ చివరలో మంగళగిరి నుంచి తెనాలి వైకుంఠపురం బదిలీ అయిన ఆయన అక్కడ ఆలయ ఆదాయాన్ని రూ.3 లక్షలు సొంతానికి వాడుకోవడం విశేషం. ఆలయ ఈఓ ఏ. రామకోటిరెడ్డి ఆదివారం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆలయంలో పనిచేసి ప్రస్తుతం వైకుంఠపురం బదిలీ అయిన జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, స్వామి వారి ఆదాయన్ని తప్పుడు లెక్కలు చూపి రూ.23,87,777 పక్కదారి పట్టించి సొంతానికి వాడుకున్నారని ఆరోపించారు. లెక్కలు తేలడంతో నోటీసులు జారీ చేయగా చేసిన తప్పును ఒప్పుకున్నాడని, తిరిగి చెల్లిస్తానని చెప్పి చెల్లించకపోవడంతో దేవదాయ శాఖ కమిషనర్‌కు నివేదిక అందజేసినట్లు చెప్పారు. ఆయన ఆదేశాలు మేరకు జూనియర్ అసిస్టెంట్ వాసును సస్పెండ్ చేసి క్రిమినల్ కేసు పెట్టినట్లు తెలిపారు. మంగళగిరి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా అతడిపై క్రిమినల్ కేసు నమోదు చేశారని ఈవో రామకోటిరెడ్డి తెలిపారు.

వీరుల గుడిని సందర్శించిన యానాది సంఘం నాయకులు



కన్నమదాసు ఆయుధాన్ని పరిశీలిస్తున్న నాయకులు

కారెంపూడి: పల్నాడు జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర యానాది సంక్షేమ సంఘం అధ్యక్షుడు కుడమల రామచంద్రయ్య, నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మానుపాటి నవీన్ ఆదివారం కారెంపూడిలో వీరుల గుడిని సందర్శించారు. పల్నాటి వీరుల ఆయుధాలకు పూజలు చేశారు. పల్నాడు వీరుల త్యాగాలు అజరామరమని, బ్రహ్మనాయుడు చాపకూడు సిద్ధాంతం, సంస్కరణలు ఉన్నతమైనవని నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంభా ఉదయ్‌కుమార్, కోశాధికారి తోకల చిన్న వీరోజి, పల్నాడు జిల్లా అధ్యక్షుడు చేవూరి వీరబ్రహ్మం, మహిళా అధ్యక్షురాలు దేవి పాల్గొన్నారు.